క్లుప్తంగా

ఆర్మీ జవాన్‌కు ఘన నివాళి



ఆర్మీజవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఆర్మీ జవాన్ ఇప్పటూరి శ్రీనివాస్‌కు బుధవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన జవాన్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా జవాన్ శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం సేవ చేసే జవాన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మృత్యువాత పడడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే అన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు



హోలీ ఆడుతున్న యువకులు, గ్రామస్తులు

షాబాద్: షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామంలో బుధవారం యువత, స్థానిక నాయకులు ఘనంగా హోలీ పండుగను జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరు రంగులు జల్లుకొని సంబరాల్లో మునిగితేలారు. ఉదయం నుంచే పిల్లలు వీధుల్లో తిరుగుతూ కనిపించిన వారిపై రంగులు చల్లుతూ ఉత్సాహంగా పండుగను జరుపుకొన్నారు. యువకులు కేరింతలు కొడుతూ, రోడ్డుపైకి వచ్చి ఒకరిపై ఒక్కరు రంగులు చల్లుకున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ యువతి గీత వివాహనికి బుధవారం దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. ఎంపీపీ ఎల్లనమోని రవీందర్‌యాదవ్ రూ.50వేలు, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కల లక్ష్మీనారాయణగౌడ్ రూ.21వేలు, గ్రామానికి చెందిన వెంకటేష్, నాగరాజు, నిరంజన్‌లు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, మల్లయ్య, రాములు, ఉమాపతి, సురేందర్, కృష్ణయ్య, సత్యనారాయణ, జంగయ్య, పాష, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాను నిర్జీవమైనా.. నేత్రాలు సజీవం

- కుటుంబ సభ్యుల ఔదార్యం
- మృతుడి నేత్రాలు దానం



ఐ బ్యాంక్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం



షాద్‌నగర్‌రూరల్/నందిగామ: నందిగామ మండల కేంద్రానికి చెందిన ఆగయ్య, మాణెమ్మల కుమారుడు మహేందర్(25), ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో సువర్ణ కుటీర్ వెంచర్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పనులను ముగించుకొని ద్విచక్రవాహనంపై మండల పరిధిలోని దూసకల్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్నాడు. దూసకల్ శివారులోకి రాగానే మహేందర్ బైక్‌ను ఎదురుగా వస్తున్న స్కూటీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహేందర్ మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు కలవడంతో మృతుడి నేత్రాలు ఇచ్చేందుకు వారు అంగీకరించారు. దీంతో ఉస్మానియాలోనే నేత్రాలను దానం చేశారు. బాధిత కుటుంబ సభ్యుల తీరును పలువురు అభినందించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని శ్రీ కల్కిదోనగుట్ట గోపాలస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, వేదపఠనం, సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయ అర్చకులు స్థానికులు శ్రీనివాస్, శ్యాంసుందర్, నితిన్ పాల్గొన్నారు.



షాద్‌నగర్‌టౌన్: స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ విశాలను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం



మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజులను సన్మానిస్తున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు కవిత తదితరులు



కొత్తూరు: కేక్ కట్ చేస్తున్నసీఐ, ఎంపీడీఓ తదితరులు

ఆమెకు సత్కారం

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయా గ్రామాల్లోని మహిళలు, ప్రజాప్రతినిధులు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి, పూలమాలలు, శాలువాలతో మహిళలను సన్మానించారు. అలాగే, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.. మహిళలు ఆర్థిక, సామాజికంగా రాణించేలా ప్రోత్సహించాలన్నారు.. ఈ సందర్భంగా పలు సంఘాల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు..



షాద్‌నగర్: మున్సిపల్ సిబ్బందికి చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాబాద్: ఎస్‌బీఐ బ్యాంకులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎస్‌బీఐ మేనేజర్ సరస్వతీ తదితరులు



కౌన్సిలర్లను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు



చేవెళ్ల: జెండా ఆవిష్కరిస్తున్న మహిళా సమాఖ్య, సీపీఐ నాయకులు



శంకర్‌పల్లి: మహిళా దినోత్సవ వేడుకల్లో చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి



కొత్తూరు: ఎస్‌వీఆర్ పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను సన్మానించిన డైరెక్టర్ దేవేందర్‌ముదిరాజ్



మొయినాబాద్: సురంగల్‌లో సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర మహిళలను సన్మానిస్తున్న నాయకులు



కొందుర్గు: మహిళలను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

ప్రతి మహిళ ఒక మొక్క నాటాలి

ఎంపీపీ ప్రియాంక



మొక్కలు నాటుతున్న ఎంపీపీ ప్రియాంక తదితరులు

నందిగామ: ప్రతి మహిళ విధిగా ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఎంపీపీ ప్రియాంక అన్నారు. మండల పరిధిలోని చేగూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ ఇచ్చిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఆకుపచ్చ రాష్ట్రంగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళ ఒక మొక్కను నాటినట్లయితే సమాజానికి ఎంతో కొంత సేవ చేసిన వారమవుతామని అన్నారు. ప్రతి మహిళ ప్రకృతి సంరక్షణ కోసం పాటు పడాలని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజమ్మ, వార్డు సభ్యులు యాదయ్య, భాస్కర్, రవి, మధు, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడలోని దక్ష హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్ అందరిని ఆకట్టుకుంది. సైన్స్‌ఫెయిర్ కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పాఠ్యాంశాలకు సంబంధించిన వివిధ రకాల ప్రదర్శనలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనాటి బాలలే భావి భారత పౌరులని, ఈ ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో దాగిఉన్న విద్యా నైపుణ్యం బయటపడుతుందన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి భవిష్యత్‌ను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, నాయకులు సత్యప్రమోద్ రావు, బాబురావు, జబ్బార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

సమాజంలో మహిళలకు భద్రత కరువు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు వజ్రమ్మ

కొందుర్గు: ప్రస్తుత సమాజంలో మహిళలకు భద్రత కరువైందని కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండలం మహిళా కమిటీ అధ్యక్షురాలు వజ్రమ్మ విమర్శించారు. బుధవారం కొందుర్గులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్ని మహిళా దినోత్సవాలు చేసిన లాభం లేదని, ఇంటి నుంచి బయటికి వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి క్షేమంగా వచ్చేవరకు నమ్మకం లేకుండా పోయిందన్నారు. ప్రతిరోజు మహిళలపై హత్యాచారాలు, అఘాయిత్యాలు చేయడం దుర్మార్గంగా మారిందన్నారు. అసమర్థ పాలకుల వల్లే మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మహిళలపై హత్యలు, హత్యాచారాలు జరుగుతున్నాయని వాపోయారు. ఇంకా ఎందరు ప్రీతి, దిశలు బలి కావాలని ప్రశ్నించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు నరేందర్, మల్లేష్‌గౌడ్, రవీందర్, రామస్వామి, నర్సింలు, రమేష్, మల్లయ్య, శ్యామ్, అశోక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: మండలంలోని జన్వాడ పెట్రోల్ పంపు వద్ద జరిగిన దాడిలో మృతి చెందిన సంజయ్ కుమార్ కుటుంబీకులను చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం మండలంలోని మృతుడి స్వగ్రామం ప్రొద్దటూరు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. సంజయ్‌కుమార్ మృతి బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతకుముందు ఆయన నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఈ కేసుకు సంబంధించిన వివరాలు తెలుసుకొని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ నాయకులు నిందితులను వెనకేసుకొని రావడం సరైనది కాదన్నారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాలన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ప్రకాశ్, ప్రతాప్‌రెడ్డి, రాములుగౌడ్, బీర్ల సురేశ్, నర్సింహ్మారెడ్డి, తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, తదితరులు

దేశాన్ని ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం

కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శన్



ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మొయినాబాద్: ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్తూ దేశాన్ని అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మొయినాబాద్‌లోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదానీ గ్రూపుల్లో ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ ప్రభుత్వ సంస్థల ద్వారా బలవంతంగా పెట్టుబడులు పెట్టించిన బీజేపీ ప్రభుత్వం అదానీ సంస్థలు స్టాక్ మార్కెట్ వల్ల నష్టపోవడంతో ఎల్ఐసీ పెట్టుబడిదారులకు సుమారు రూ.3400 కోట్లు నష్టాన్ని కలిగించారన్నారు. ఎస్‌బీఐ, ఇతర బ్యాంకుల ద్వారా అదానీ గ్రూపుల్లో పెట్టుబడుల ద్వారా రూ. 8వేల కోట్లు బ్యాంకులకు బాకీ పడ్డారని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజల సొమ్మును అదానీ కంపెనీలకు తాకట్టుపెట్టారని వివరించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై పెనుభారాన్ని మోపారని వాపోయారు. దేశాన్ని అమ్మే కుట్ర చేస్తున్న బీజేపీని వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, నాయకులు గౌరి సతీష్, ఉదయ్‌మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, రాములు, మహేందర్, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ గణేష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బచావో సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జన సమితి చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి రామకృష్ణ

షాబాద్: తెలంగాణ బచావో సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జన సమితి చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీన వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్ ఆర్టీసీ కళ్యాణ మండపం ఎదురుగా బాగ్ లింగంపల్లిలో తెలంగాణ బచావో సదస్సును ప్రొఫెసర్ కోదండరామ్ నాయకత్వంలో జరగనుందన్నారు. మిలియం మార్చ్ స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. తెలంగాణను కాపాడుకుందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని చెప్పారు. అంగరంగ వైభవంగా సెక్రటేరియట్, ప్రగతి భవన్‌లు, అరకొర వసతులతో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని వాపోయారు. కార్యక్రమంలో జనసమితి నాయకులు ఉన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎల్మినేడు గ్రామ రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆర్‌అండ్‌బీ డీఈఈ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎనిమిది సంవత్సరాల్లో నియోజకవర్గంలోని రహదారులను రూ.500 కోట్లతో డబుల్ రోడ్లుగా మార్చాడానికి కృషి చేశామన్నారు . ఇబ్రహీంపట్నం నుంచి ఎల్మినేడు, పోచారం, మంగళ్‌పల్లి మీదుగా డబుల్‌రోడ్డు ఏర్పాటుకు రూ.59 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. రూ.25 కోట్లతో యాచారం నుంచి మీరఖాన్‌పేట వరకు, నందివనపర్తి నుంచి మేడిపల్లి వరకు, రూ.40 కోట్లతో పెద్దంబర్‌పేట నుంచి కావడిపల్లి వరకు, రూ.7.80 కోట్ల తో ఆగాపల్లి నుంచి తులేకలాన్ వరకు రూ.3.09 కోట్లతో డబుల్‌లేన్ల రోడ్ల విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పా రు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, నీటి పారుదల శాఖ డీఈ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన కేస్లీ ఇటీవల మృతి చెందింది. కేస్లీ కుటుంబ సభ్యులను బుధవారం ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, పత్యా, లాల్యా పాల్గొన్నారు.

వైభవంగా కొమరబండ ఉత్సవాలు

దేవాదాయ-ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాస్

షాబాద్: కొమరబండ శ్రీ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని దేవాదాయ-ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బుగ్గరామేశ్వస్వామి దేవాలయంలో గ్రామ సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి ఉగాది నుంచి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని సూచించారు. ఈ ఉత్సవాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.